

జగిత్యాల జిల్లా కేంద్రంలో గణనాథుల శోభాయాత్ర



మల్లాపూర్: నిమజ్జన వేడుకల్లో చిన్నారులు





జగిత్యాల చింతకుంట చెరువులో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

# వినాయకా.. సెలవిక

- గణనాథుడికి ఘన వీడ్కోలు
- జిల్లా కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అంబరాన్నంటిన నిమజ్జన వేడుకలు
- కనుల పండువలా శోభాయాత్రలు

జగిత్యాల/ జగిత్యాల కలెక్టరేట్/మల్లాపూర్, సెప్టెంబర్ 17: నవరాత్రులు ఘనమైన పూజలందుకున్న గణనాథుడికి జగిత్యాల పట్టణవాసులతోపాటు జగిత్యాల రూరల్, సారంగాపూర్, మల్లాపూర్ మండలాల ప్రజలు ఘనవీడ్కోలు పలికారు. మంగళవారం రెండోరోజు నిమజ్జన వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. సాయంత్రం విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో ప్రతిమలను ప్రతిష్టించి, ఊరూరా కన్నుల పండువగా శోభాయాత్రలు తీశారు. వైభవంగా సాగిన ఈ యాత్రలకు జనం నీరాజనం పట్టారు. దారి పొడవునా 'జై గణేశా.. జై జై గణేశా..', 'గణపతి బొప్పా మోరియా..', 'ఆదా లడ్డూ కాలియా..' నినాదాలు మిన్నంటగా, డప్పు చప్పుళ్ల హోరు.. అతివల కోలాటాలు.. యువతీయువకుల నృత్యాలు, చిన్నారుల కేరింతల నడుమ లంబోదరుడిని తరలించారు. జగిత్యాల పట్టణవాసులు చింతకుంట చెరువు, ఆయా గ్రామాల వారు చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కాగా, జిల్లా కేంద్రంలో కలెక్టర్ సత్యప్రసాద్, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్లు కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో జగిత్యాల పట్టణ జగిత్యాల రూరల్, ధర్మపురి, మాల్యాల సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రాంనర్సింహారెడ్డి, నీలం రవిలు, ఆర్ఐ బందోబస్తు కల్పించారు.



జగిత్యాల జిల్లాకేంద్రంలో శోభయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు



జగిత్యాలలో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకొస్తున్న చిన్నారులు



జగిత్యాలలో బ్యాండ్ మేళా మధ్య నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



కోరుట్ల: పూల్ వాగులో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

## వైభవంగా లక్ష పుష్పార్చన



గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా కోరుట్ల వాసవి కల్యాణ భవనంలో గణపతి మండపం వద్ద మంగళవారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి హవనం, చండీ హోమం, తదితర పూజ కార్యక్రమాలు జరిపించారు. 108 నైవేద్యాలు సమర్పించారు. – కోరుట్ల, సెప్టెంబర్ 17




















